వాన పడినా.. తగ్గని వేడి...

- అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా వేడి మాత్రం తగ్గడం లేదు. ఆదివారం జిల్లాలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది కంటే 2 డిగ్రీల వేడి పెరిగింది. దీంతో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలై ప్రస్తుతం ఎండ తీవ్రత పెరిగింది. అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా వేడి ఏ మాత్రం తగ్గడం లేదు. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ప్రస్తుతం 42 డిగ్రీలకు చేరుకుంది. ఆదివారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా..

నగరం	గరిష్ట ఉష్ణోగ్రత (సెల్సియస్‌లో)
ఆళ్లగడ్డ	42
నంద్యాల	41
పాణ్యం	41
బనగానపల్లె	41
నందికొట్కూరు	41
ఆత్మకూరు	41
కర్నూలు	40
ఎమ్మిగనూరు	39
ఆదోని	39
డోన్	38

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండ తీవ్రత పట్ల ప్రజలు జర జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుండి బయటకు రాకూడాదు. బాలింతలు, చిన్న పిల్లలు, వద్దులు మరింత జాగ్రత్తలు పాటించాలి. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి. మజ్జిగ, నిమ్మరసం తరచుగా తీసుకోవాలి. ఎవరైనా బయటికి వెళ్లేటప్పుడు తేలికపాటి దుస్తులు, కాటన్ దుస్తులు, తెల్ల దుస్తులు ధరించి, వాటర్ బాటిల్ ను తీసుకొని వెళ్లాలి. పనిచేసుకునే ప్రదేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర పనులు చేసుకునే ప్రజలు టెంట్లు ఏర్పాటు చేసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలి.

- ఆది నాగేష్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, పత్తికొండ సిహెచ్‌సి.

ఉపాధి కూలీలందరికీ పనుల కల్పన

- 2500 నీటి కుంటలు నిర్మాణం లక్ష్యం - 6 వేల హెక్టార్లలో హార్టికల్చర్ ప్లాంటేషన్
- ప్రజాశక్తితో డ్వామా పిడి వెంకటరమణయ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'జిల్లాలో ఈ ఏడాది ఉపాధి కూలీల వలసల నివారణకు అనేక చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. చిన్న సన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. జిల్లాలో దాదాపుగా 6000 హెక్టార్లలో హార్టికల్చర్ ప్లాంటేషన్ చేపడుతున్నాం. రానున్న వర్షా కాలంలో రైతులు పంట పొలాల్లో సాగునీటికి ఇబ్బంది లేకుండా పంట కుంటల నిర్మాణం చేపడు తున్నాం. జిల్లాలో 2500 నీటి కుంటలు నిర్మించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి తావు లేకుండా విధులను పక్కాగా నిర్వహించాలి' అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్య అన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు.

జిల్లాలో ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి? ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల అయ్యాయా లేదా?

పిడి : ప్రస్తుతం కర్నూలు జిల్లాలో దాదాపుగా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోజువారీగా దాదాపుగా 1,21 లక్షల మంది ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు పెట్టాలని క్షేత్రస్థాయిలోని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మార్చి నెలాఖరు వరకు ఉపాధి కూలీలు చేసిన పనులకు రూ.45 కోట్లు పెండింగ్ వేతనాలు కూడా విడుదలయ్యాయి. మిగిలిన పెండింగ్ వేతనాలు కూడా త్వరలోనే జమ కానున్నాయి.

జిల్లాలో నీటికుంటలు నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయి?

పిడి : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగింది. రానున్న వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిని నీటికుంటల్లో నిలువ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రైతులు తమ పంట పొలాల మధ్యలో నీటి కుంటల నిర్మాణం చేపట్టుకుంటే పంటలకు సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అలాగే భూగర్భ జలాలు కూడా చుట్టూ పెరిగే అవకాశం ఉంది. దీని చుట్టూ రైతులు హార్టికల్చర్ పంటల సాగు కూడా చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం దాదాపుగా 2500 నీటి కుంటలను నిర్మించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఉపాధి హామీ కింద హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమం ఎలా జరుగుతోంది?

పిడి : చిన్న సన్నకారు రైతులు హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసుకునేందుకు ముందుకు వస్తే 100 శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను అందజేయడం జరుగుతుంది. అలాగే కూరగాయల సాగు కూడా చేసుకునేందుకు అవకాశం. రైతులు కేవలం వ్యవసాయ పంటల చేసుకోవడమే కాకుండా అదనంగా హార్టికల్చర్ పంటల సాగు చేసుకుంటే అదనపు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలుపై విస్తతంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 6,000 హెక్టార్లలో హార్టి కల్చర్ ప్లాంటేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 3వేల హెక్టార్లలో హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసేందుకు రైతులను గుర్తించడం జరిగింది.

జిల్లాలో ఇటీవల కాలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు పెరుగుతున్నాయి? కొన్నిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లను అక్రమంగా తొలగిస్తున్నారు దీనిపై మీ స్పందన ఏమిటి?

పిడి : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది. ఎక్కడ కూడా అవినీతికి తావు లేకుండా చూడాలని హెచ్చరించడం జరిగింది. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు స్వేచ్ఛగా తమ విధులను నిర్వహించుకోవాలి. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుంది. ఫీల్డ్ అసిస్టెంట్లను ఎవరిని అక్రమంగా తొలగించే ప్రసక్తే లేదు.

అభివృద్ధికి సైన్స్ ఆలోచనలు పునాది

- ప్రజా సైన్స్ ఉద్యమంతోనే అభివృద్ధి సాధ్యం
- సైన్స్ ఫలాలు అందరికీ అందాలి
- అశాస్త్రీయ భావజాలాన్ని ప్రశ్నించాలి
- విఠపు బాలసుబ్రహ్మణ్యం
- సైన్స్ ఆలోచనలు పెరగాలి : డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి -కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

అభివృద్ధికి సైన్స్ ఆలోచనలు పునాది అని, ప్రజాసైన్స్ ఉద్యమంతోనే అభివృద్ధి సాధ్యమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. భారతదేశంలో అభివృద్ధితో పాటు సైన్స్ ఆలోచనలు పెరగాలని, శాస్త్ర పరిశోధనలకు మనం ప్రాముఖ్యత ఇవ్వాలని, సైన్స్ ఫలాలు సామాన్య ప్రజలందరికీ అందేలా చూడాలని అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రాంతీయ వర్క్ షాప్ డోన్ శ్రీసుధ స్కూల్‌లో జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. జెవివి జెండాను మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. 'ప్రజాసైన్సు ఉద్యమం-తాత్వికత ప్రస్తుత కర్తవ్యాలు' అంశంపై నిర్వహించిన సెషన్‌కు రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ అధ్యక్షత వహించారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మానవుడు ప్రకతి రహస్యాలను ఛేదిస్తూ, అందులోని భౌతిక సూత్రాలను కనుక్కొంటూ ఆధునిక మానవుడిగా తయారయ్యాడని, ఈ క్రమంలోనే సైన్స్ పెరిగిందని అన్నారు. 1920-30 దశకంలో మొదటి ప్రపంచం యుద్ధకాలం నాటికి సైన్స్ కొత్తపుంతలు తొక్కి పారిశ్రామిక అభివృద్ధి చెంది మానవుని అవసరాలు తీర్చుకున్నాడన్నారు. సామ్రాజ్య వాద దేశాలు పెద్దఎత్తున ఉత్పత్తులు పెంచుకుని వలసలకు దారి తీయడం, వెనుకబడి దేశాలను పీల్చి పిప్పి చేశాయన్నారు. వలస వాదులు బ్రిటిష్ పాలకులు మనదేశంలోకి వచ్చి సంపదనలు దోచుకుపోయారన్నారు. ఆదశలో సైన్స్ అభివృద్ధి అనేది దుర్మార్గానికి దారితీసిందన్నారు. ఉత్పత్తులు పెంచి మనదేశాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారన్నారు. రెండో ప్రంపచం యుద్ధం నాటికి సామ్రాజ్య వాద దేశాలు ఆయుధాలు సమకూర్చుకుని ఇతర దేశాలపై దాడులు పెంచారన్నారు. సైన్స్‌ను స్వార్థ్యం కోసం ఎలా వాడుకున్నారో ఇలాంటి పరిణామాలు గుర్తు చేస్తాయన్నారు. అదే 1917లో సోవియట్ రస్యాలో విప్లవం ఏర్పడ్డాక సైన్స్‌ను ప్రజాహితం కోసం ఉపయోగించి గొప్ప సమాజాన్ని నిర్మించారన్నారు. 1930లో లండన్‌లో జరిగిన సైన్స్ గోష్టిలో రస్యాసైన్‌టిస్ట్ సైన్స్‌ను సమాజ హితానికి ఎలా ఉపయోగించాలలో చెప్పారన్నారు. సైన్స్‌తో అభివృద్ధి చెందాలంటే ఆదేశంలోని పాలకుల చిత్తశుద్ధి ప్రజల ప్రయోజనాలను ఆలోచించే వారుంటే సైన్స్‌ను ఎలా ఉపయోగపడుతుందో ఈపరిణామాలు మనకు అర్థమవుతాయన్నారు. సైన్స్‌ను సమాజంతో పోల్చిచూసుకోవాలని అన్నారు. కొత్త పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు మనదేశానికి స్వాతంత్ర్య వచ్చిన కొత్తలో పునాదులు పడ్డాయన్నారు. నెహ్రూప్రధానిగా ఉన్న కాలంలో ఇస్రో, ఐసిఎస్ఇ, ఐఐటి లాంటివి 1960లో వచ్చాయన్నారు. వ్యవసాయంలో కొత్త వండగాలు వచ్చాయన్నారు. మాతృభాషలో సైన్స్ అభివృద్ధికోసం కృషి పెరిగింది. ప్రస్తుతం కేరళలో మలయాళ శాస్త్రీయ పరిషత్ ఏర్పడింది. పేరుతో అనేక కొత్త ఆవిష్కరణలు చేశారు. తమిళనాలు, హర్యానలో ఇలాంటి అనేక సంస్థలు ఏర్పడ్డాయి. సైన్స్ అనేది ఒక ఉద్యమంగా గుర్తించాలి. దీనిని జెవివి ఒక్కటే సాధించలేదు. డాక్టర్లు, టీచర్లు, వివిధ రంగాలలో పనిచేసే నిష్ణాతులను, రచయితలను కలుపుకుని పని చేయాలన్నారు. సైన్స్ చుట్టూ జెవివి పని చేయాలని సూచించారు. మనచుట్టూ కులం,మతం ఉన్నాయని గుర్తించాలి. అన్ని అభివృద్ధి వైపు పోవడానికి సైన్స్‌ను ఎలా అప్లయ్ చేయాలో ఆలోచించాలన్నారు. అధ్యయనం పెంచుకోవాలి, విద్య, వైద్యం, పర్యావరణం పట్ల అవగాహన పెంచుకుని ప్రజలకు అవగాహన కల్పించగలగాలని సూచించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం

రెండో సెషన్‌లో 'జెవివి నిర్మాణం-కొన్ని ప్రాధాన్యతలు' అంశంపై జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. సైన్స్ అభివద్ధి చెందడం నుంచే సెక్యులరిజం, డెమోక్రసీ వచ్చాయని అన్నారు. ప్రశ్నించేతత్వం, సృజనాత్మక పెరగడానికి సైన్సే మూలమని అన్నారు. జనవిజ్ఞాన వేదిక సైన్స్ కేంద్రంగా నడుస్తున్న ప్రజాసైన్స్ ఉద్యమమని, ఇది ప్రజల్లో ప్రగతికోసం, స్వావలంబన కోసం, అభివృద్ధి కోసం, సామాజిక విప్లవం కోసం పనిచేస్తోందన్నారు. జెవివి కార్యకర్తలందరూ ఈ కషిని మరింత ముందుకు తీసుకుపోవాలని కోరారు. యువతలో, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెరిగేలా కషి చేయాలని అన్నారు. జెవివి సాహిత్యాన్ని అందరి దగ్గరికీ తీసుకుపోవాలని అన్నారు. ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు కళాజాతలు, విద్యార్థులలో సృజనాత్మక పెరగడానికి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని, పరిశోధనాతత్వం పెరగడానికి యురేకా సైన్స్ ఎక్స్పో పోటీలు నిర్వహించామని అన్నారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలనుంచి వచ్చిన జెవివి ముఖ్యనాయకులకు, రాష్ట్ర నాయకులకు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, సత్యసాయి జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆదిశేషు, మహేందర్ రెడ్డి, కర్నూలుజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాజాహుస్సేన్, సుధీర్ రాజు, జెవివి సమతా నాయకులు డాక్టర్ ప్రసూన, నాయకులు వెంకటేష్, డా. హనీఫ్, ప్రసాద్, లోకేష్, బాబు, సర్వజ్ఞమూర్తి, లతీఫ్, గోపాల్, చిన్నయ్య, నరసింహా రెడ్డి, నరసింహులు, శాంతి ప్రియ, చంద్రశేఖర్ రెడ్డి, ఖలందర్, వర్మ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

విద్యను ప్రైవేట్ పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలకు యాజమాన్యం చేతిలో రాష్ట్ర ప్రభుత్వం కీలు బొమ్మల మారిందనీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ చెప్పారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో యాజమాన్యం ఎలా చెబితే అలా నిర్ణయాలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఒకవైపు ఫీజుల పేరుతో ర్యాంకుల పేరుతో విద్యార్థులను వేధిస్తూ వారిని మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తి కాగానే సెలవలు ఇచ్చేవారు కాని ఈ సంవత్సరం మాత్రం అలా కాకుండా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు క్లాసులు నిర్వహించటం అడ్మిషన్లు చేసుకోవచ్చు అని చెప్పటం ప్రైవేట్, కార్పొరేట్ కలశాలల యాజమాన్యం విచ్చల విడిగా క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను నేటివరకు సెలవలు ఇవ్వని పరిస్థితి కనిపిస్తుంది. దినికి కారణం ఇంటర్మీడియట్ విద్యా మండలిలో నారాయణ, శ్రీ చైతన్య, యాస్ఆర్, ఇతర ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు చెందిన వారికి కి ప్రభుత్వంలో చోటు కల్పించటం వల్లనే ఈ కార్పొరేట్ విద్యా విధానాలు ఈ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యను నాశనం చేస్తున్నాయన్నారు. వారి మెప్పు కోసమే విద్యాశాఖ మంత్రి పని చేస్తున్నారు తప్ప విద్యార్థుల కోసం కాదని ఆరోపించారు. ఇప్పటికైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మొద్దు నిద్ర వీడి తక్షణమే ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవులు మంజూరు చేసి వారిని మానసిక ఒత్తిడి నుండి దూరం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు అబుబక్కర్, మల్లేష్ రాము, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పోలకల్ హైస్కూల్ శివారులో పేకాట స్థావరంపై సి బెళగల్ ఎస్ఐ పరమేష్ నాయక్ ఆదివారం తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇక్కడే జూదగాళ్లు ముక్కెర వెంకటేష్, బోయ వీరేష్, బోయ సుంకన్న, మంగలి నాగరాజు, బోయ నాయుడు, మన్యం కొండలను అరెస్టు చేసి అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుండి సెల్ ఫోన్లు, నగదు రూ 1540 స్వాధీనం చేసుకున్నారు. జూదం వలన కుటుంబాలు ఆర్థికంగా చితికి వీధినపడక తప్పదని సామాన్యులకు ఎస్ఐ తగదన్నారు.

గందరగోళం

- బదిలీలు పదోన్నతుల పట్ల స్పష్టత కరువు
- రోజుకో ఉత్తర్వులను ఇస్తున్న విద్యాశాఖ
- నేడు డిఇఒ ఆఫీస్ ఎదుట యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల పట్ల విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలు గందర గోళానికి గురిచేస్తుంది. ఇప్పటివరకు విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులపై స్పష్టత లేకుండానే ముందుకు సాగుతుంది. రోజుకొక ఉత్తర్వులను జారీ చేయడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ చర్యలను నిరసిస్తూ సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులతో ధర్నా చేపట్టేందుకు సన్నద్ధ మైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాల విద్యాశాఖలు గాడిలో పెడతామని ఆ శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులను వేసవి సెలవుల్లోనే పూర్తి చేస్తామని ప్రకటించారు. అలాగే జీవో నంబర్ 117 కూడా రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఆ జీవోను రద్దు చేసినట్లు ఎక్కడ విద్యాశాఖ ప్రకటించలేదు. ఆ జీవోకు ప్రత్యామ్నాయ జీవోను తీసుకుని వచ్చేందుకు చెబుతుంది కానీ ఎక్కడ ఆచరణకు నోచుకోలేదు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి చట్టం రూపొందించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇప్పుడు పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో కొత్తగా తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటుకు విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ తొమ్మిది రకాల పాఠశాలలో ఏర్పాటులో ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థ మరింత నిర్వీర్యం అయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నా రు. ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థ బలో పేతానికి అడుగులు వేయాల్సింది పోయి నిర్వీర్యానికి చర్యలు తీసుకోవడం పట్ల మండి పడుతున్నారు. బదిలీలకు సంబంధించి ఇప్పటివరకు తీసుకుంటున్న చర్యల పట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపుగా 5000 మంది ఉపాధ్యాయుల బదిలీల ఖాళీలను ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఉపాధ్యా యుల బదిలీలకు ఖాళీలకు సంబంధించిన వివరాలను కూడా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపించారు. బదిలీలకు సంబంధించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపా ధ్యాయ సంఘాలతో చర్చించకుండానే ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల విద్యాశాఖ నిరంకుశ వైఖరి: యుటిఎఫ్

ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ నిరంకుశ వైఖరి అవలంబిస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి లు అన్నారు. బదిలీలు, పదోన్నతులు, ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్‌జిటిలకు మ్యానువల్ కౌన్సిలింగ్ చేపట్టాలన్నారు. పాఠశాలల పునర్వ్య వస్థీకరణలో ఉన్న లోపాలను సవరించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను ఆరుగురిని నియమించాలని ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఈ డిమాండ్లన్నిటితో సోమవారం ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులతో ధర్నా చేపడుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు కోరారు.

టైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం

- మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నగరూరు శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం నగరంలోని కొండారెడ్డి బురుజు ఓపెన్ థియేటర్, కెఎంసి పార్క్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన టైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ నగరూరు శమంతకమణి బెల్టులు అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ, క్రీడల వల్ల విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే నా ఆకాంక్ష అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజూ సాధనతో వారు చురుకుగా మారతారని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శారీరక శక్తి పెరుగుతుందన్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే టైక్వాండో ఒలింపిక్ క్రీడల్లో కూడా స్థానం పొందిన క్రీడా రంగంలో ఉద్యోగ అవకాశాలూ ఉన్నాయని గుర్తు చేశారు. టైక్వాండో కర్నూలు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, బ్లాక్ బెల్టర్లు తేజ, అజయ్, తిలక్, అఖిల్, సాయికృష్ణ, నందిని, అశ్విని, శ్రీ లలిత, భార్గవ్, మల్లేష్, విశ్వాస రావు వంటి జూనియర్ శిక్షకులు పాల్గొన్నారు.



తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేసి అభినందిస్తున్న నగరూరు శమంతకమణి

రసాయన కాలుష్యం మానవ మనుగడకే ముప్పు

- రసాయనాల తయారీ ఆపి
ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రసాయన కాలుష్యంతో మానవులకు ముప్పు వాటిల్లే ప్రాణాంతక రసాయనాల తయారీని ఆపి కర్నూలు ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు ఇచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవనంలో ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కొత్త పరిశ్రమలు మన ప్రాంతానికి వస్తే దాని ద్వారా ఉపాధి పెరిగి మన కడుపుని నిండుతాయంటే అంతకంటే సంబరం మరొకటి ఉండదని, కానీ వచ్చే పరిశ్రమ ద్వారా మన బతుకే ప్రశ్నార్ధకమవుతుందని అంటే, మన భవిష్యత్ తరానికి శాపంగా మారుతుంది అని అంటే, దానిపై మనం ప్రశ్నించకపోతే.. మన మరణ శయ్యను మనమే పేర్చుకుంటున్నట్లు లెక్కఅని, అలాంటి రసాయనాల తయారీని వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఆపాలని ప్రజాస్వామ్య సంఘాల నాయకులు కోరారు. కర్నూల్ నగరంకు అనుకుని ఉన్న గొందిపర్ల గ్రామ పరిధిలో ఉన్న ఆల్కలిస్ ఫ్యాక్టరీ మరో కొత్త రకమైన రసాయన ఉత్పత్తి కోసం ప్రభుత్వం నుండి అనుమతి పొందిందని, ప్రాణాంతకమైన ఆ ఉత్పత్తిని ఆపాలని కోరుతూ ఉత్పత్తి వల్ల జరిగే నష్టానికి సంబంధించి ముందుగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు వివరించారు. అనంతరం రౌండ్ టేబుల్ లో వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రిటైర్డ్ లెక్చరర్ సి.రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రత్నం ఏసేపు, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి, పిఓపి నాయకులు శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక నాయకులు అల్లాబకష్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, ఎస్ యు సి ఐ నాయకులు నాగన్న, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ఏ. సుభాన్, ప్రజా పరిరక్షణ సమితి నాయకులు డేవిడ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇమ్మానియేల్ పాల్గొని మాట్లాడారు. ఆల్కలీస్ ఫ్యాక్టరీలో కొత్తగా తయారు చేయబోతున్న పిటిఎఫ్ఇ తయారీకి మొదటి ప్రపంచ యుద్ధంలో వాడిన విషతుల్యమైన క్లోరిన్ వాడాల్సి వస్తుందన్నారు. దీని తయారీ ద్వారా వచ్చే వ్యర్థాలు మానవ మనుగడకే ప్రమాదంగా మారుతాయన్నారు. ఇలాంటి తయారీని కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి ముందస్తు ప్రచారం లేకుండానే ప్రజాభిప్రాయ సేకరణకు తేదీని ప్రకటించడం మూడు రాష్ట్రాల ప్రజల ప్రాణాలను బలిపెట్టడమే అన్నారు. 14న జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేసి, దాని ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేసిన అనంతరం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లాలని వారు డిమాండ్ చేశారు. పిటిఎఫ్ఇ తయారీని రద్దు కోరుతూ 12న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రౌండ్ టేబుల్ లో మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు అరుణమ్మ, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, పిఓపి నాయకులు మోహన్, హెచ్ ఆర్ ఎఫ్ నాయకులు దేవేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాగునీటి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలి

- సిపిఎం పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలంలోని గ్రామాలకు నిధులు కేటాయించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దతుంబలం నుండి పాదయాత్రను ఆదివారం సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రామాంజనేయులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.వెంకటేశులు ప్రారంభించారు. మొదటిరోజు పాదయాత్ర పెద్దతుంబలం గ్రామం నుండి బల్లెకల్, కుప్పగల్, పాండవుగల్, గణేకల్లు, జలమంచి, దొడ్డనగిరి వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని మండలంలోని చాలా గ్రామాల్లో తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్నారని, ప్రజానీకానికి తక్షణమే తాగునీళ్ళు అందించాలని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గత 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్.ఎస్ ట్యాంకులు పైప్ లైన్ ఇప్పుడున్న జనాభాకు అనుగుణంగా నీళ్ల అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. గత ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, తాగునీరందించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ చేపట్టిన పాదయాత్ర పెద్దతుంబలం నుండి ప్రారంభమై నెట్టేకల్ వరకు కొనసాగుతుందని మూడు రోజులపాటు 80 కిలోమీటర్లు 22 గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి మే 14న ఆర్డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం ముందు మహా ధర్నాతో ముగుస్తుందన్నారు. ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే.లింగన్న, నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, రామాంజనేయులు, పాండవగల్ గ్రామ సర్పంచ్ కె.ఉమాదేవి, పార్టీ మండల నాయకులు అయ్యప్ప, హనుమంత్ రెడ్డి, పాండురంగ, అయ్యన్న, మునిస్వామి పాల్గొన్నారు.

సిపిఎం పాదయాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

టెక్స్ టైల్‌పార్కును విచ్ఛిన్నం చేసిన వైసిపి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మిగనూరులో చేనేతల అభివృద్ధి, ఉపాధి కోసం టైల్స్ పార్కుకు కేటాయించిన భూములను తమకు అనుకూలమైన వారికి పట్టాలిచ్చి కట్టబెట్టి వైసిపి సర్కారు విచ్ఛిన్నం చేసిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. ఐరన్ బండ గ్రామంలో టిడిపి నాయకుడు రాముడు కుమారుడు వివాహానికి ఆయన ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి, స్వర్గీయ బివి మోహన్ రెడ్డి 2004లో చేనేతల అభివృద్ధి కోసం ప్రత్యేక స్థలం కేటాయించి టైల్స్ పార్కుకు శంకుస్థాపన చేశారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ పార్కును పులివెందులకు తరలించారన్నారు. తిరిగి 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో 100 ఎకరాలను టెక్స్‌టైల్స్ పార్కు కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి పార్కు ఏర్పాటు లక్ష్యాన్ని విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 11 నెలలకే టిడిపి కూటమి ప్రభుత్వం టెక్స్‌టైల్స్ పార్కు పనులను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో నజీర్ సాహెబ్, ఎన్‌వి రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, తిమ్మారెడ్డి, భగవంత రెడ్డి, ముల్ల బాష, రాంపురం రఫీ, బొగ్గ రమేష్, రాజేష్, హరికృష్ణ పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వరరెడ్డి

ప్రభుత్వ స్కూలు వర్కర్స్‌కు రూ.15 వేలివ్వాలి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ప్రభుత్వ స్కూల్ వర్కర్లకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు డిమాండ్ చేశారు.ఆదివారం సిఐటియు కార్యాలయంలో స్కూల్ వర్కర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న స్కూల్ వర్కర్స్ కు కేవలం 6000 మాత్రమే ఇస్తున్నారు ప్రస్తుత ధరలకు కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు కూటమి ప్రభుత్వం వచ్చిన సందర్భంగా చిరు ఉద్యోగులు మా వేతనాలు పెంచుతారని ఎంతో ఆశతో ఎదురు చూశారని కానీ నేటికీ 11 మాసాలు అవుతున్న మా యొక్క వేతనాలు పెంపు విషయములో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ కి విజ్ఞప్తి చేశారు ప్రస్తుతమిస్తున్న 6000 కూడా ప్రతినెల ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్త పరిచారు ప్రభుత్వ స్కూల్ వర్కర్స్ ఆయాలు వాచ్మెన్లు సమస్యలు ప్రభుత్వం మానవతా దక్పథంతో ఆలోచించి మా యొక్క వేతనాలు పెంచాలని యూనిఫారం ఉచిత సైకిలు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం 62 యేళ్ల వయోపరిమితి సర్వీసును చట్టబద్ధత చేయాలని చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని పని భద్రత కల్పించాలని అని అన్నారు తదితర సమస్యలను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. స్కూల్ వర్కర్స్ సంఘం నాయకులు సి నారాయణస్వామి కే ప్రతాప్ కే గణేష్ ఎం భాష శ్రీనివాసులు యు యం కవిత లక్ష్మీదేవి గణేష్ లక్ష్మీ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మిగనూరు మండల సిఐటియు కార్యదర్శి రాముడు

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి శివలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి గోవిందు, బి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఆశ వర్కర్ల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి వైద్య రంగంలో ఆశా కార్యకర్తలు చాలీచాలని వేతనాలతో అనేక రకాల సేవలు అందిస్తున్నారని, పనికి తగిన వేతనం నేటికీ నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా నరేంద్ర మోడీ కూటమి ప్రభుత్వం ఆశ వర్కర్ పట్ల వేతనాలు పెంపు పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. వీరికి జాబ్ చార్ట్ పద్ధతి కాకుండా ఇతర పనులు చేస్తున్నారని ఎనిమిది గంటల పని కాకుండా ఇష్టానుసారంగా పై అధికారులు సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ఆశ వర్కర్లు ప్రజలకు ప్రాణాలు తెగించి సేవలు చేశారని సాక్షాత్తు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అభినందించారని, కానీ పనికి తగిన వేతనం మాత్రం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. 20న దేశవ్యాప్త సమ్మెను ఆశ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ఆశ వర్కర్ల సమ్మె డిమాండ్ల కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు నాయకులు మంజుల, సుమిత్ర, రబియా, పద్మ, మహాలక్ష్మి, నాగమణి, విశాలాక్షి రంగా లక్ష్మి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె డిమాండ్ల కార్డును విడుదల చేస్తున్న నాయకులు గోవిందు, తదితరులు

విద్యుత్ సంస్థను కాపాడుకుందాం

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ వారోత్సవాల్లో నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల మనుగడకు ముప్పు వాటిల్లే ఒప్పందాలు చేసుకుంటూ విద్యుత్ సంస్థను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని, ఐక్యంగా ఉద్యమించి సంస్థను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. ఆదోని విద్యుత్ భవన్ ఆవరణంలో ఆదివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సౌర విద్యుత్తు, గాలిమరలు మెయింటినెన్స్ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు అప్పగించారన్నారు. ఉచిత విద్యుత్తు ఎత్తు వేసేందుకే స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం తెరమీదకు తెచ్చిందన్నారు. వ్యవసాయానికి ఇప్పటికే స్మార్ట్ మీటర్లు ప్రభుత్వం బిగించిందన్నారు. త్వరలో గహ నివాసాలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఇలా సంస్కరణ పేరుతో ఉద్యోగులను కార్మికుల ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నం జరుగుతుందని గమనించాలన్నారు విద్యుత్ సంస్థలో ఇప్పటికే సుమారు 50 వేల మంది ఉద్యోగ కార్మికులు రెగ్యులర్ కావలసి ఉందన్నారు. ఎన్నికలకు ముందు అందర్నీ రెగ్యులర్ చేస్తామని కనీస వేతన అమలు చేస్తామని అధికారంలోకి రాగానే హామీలను తుంగలో తొక్కడం నాయకులకు పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ఒప్పందాల పేరుతో విద్యుత్ కార్పొరేషన్లను ఆదాని, అంబానీలకు అప్పనంగా కట్టపెట్టేందుకు ప్రభుత్వాలు తహతహలాడుతున్నాయని విమర్శించారు. ఉద్యోగ ,కార్మికులు ఇలాగే నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యుత్ సంస్థ పూర్తి స్థాయిలో కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వాలు తల ఊపి ఒప్పందాలను అమలు చేస్తూ ఉద్యోగ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. మీటర్ రీడర్స్, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు,సబ్ స్టేషన్ ఆపరేటర్లు వాచ్మెన్లు తక్కువ జీతాలకు పని చేస్తున్న ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా హక్కుల సాధన కోసం ఉద్యోగ కార్మిక సంఘాలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విద్యుత్తు శాఖ ఉద్యోగ కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు. ఉద్యోగ కార్మికులు తమకు సంఘీభావం తెలపాలని కోరారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, యూనియన్ నాయకులు బాబు, సోము, డివిజన్ కార్యదర్శి దేవేంద్ర, సెక్రెటరీ రాజు, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, ఆదోని సిఐటియు అధ్యక్షులు తిప్పన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

బసవన్న సాహిత్యంపై ఆదోనిలో రాష్ట్రస్థాయి సదస్సు

- సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈ భూమి శ్రమజీవులదని ఈ శ్రమలోనే సమాజం నిర్మితమైందని సమాజంలో కులం లేదు మతం లేదు మానవత్వమే ఈ సమాజానికి జీవనాధారం అని చాటి చెప్పిన విశ్వగురు బసవన్న సాహిత్యంపై త్వరలో ఆదోనిలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ముందుగా యుద్ధంలో అమరులైన వారికి సభ సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక విప్లవకారుడు బసవన్న అనే అంశంపై సదస్సుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 12వ శతాబ్దంలోనే కార్మిక వర్గం నా అస్తిత్వం అంటూ ప్రకటించిన గొప్ప మహోన్నతుడు అని అభివర్ణించారు. పేద ధనిక ఆడ మగ తేడాలు ఉండరాదని ఈ ప్రపంచానికి చాటి చెప్పాడని అన్నారు. సంపద అందరిదని ఇంకా చెప్పాలంటే ఉత్పత్తి చేసే శ్రమజీవులదని శ్రామిక ప్రజలపక్షాన ప్రవచనాలను చెప్పి మానవీయవ్యవస్థ నిర్మితమయ్యేందుకు కృషిచేసారని అన్నారు. దళితులు గిరిజనులు హక్కులు కోల్పోయిన ప్రతి ఒక్కరు హక్కులు ఉండాలని మనిషిని విముక్తి చేయాలని బానిసత్వం కూడదని ఆయన ప్రవచనాల్లో ప్రవచించారని అన్నారు. 850 సంవత్సరాల క్రితమే కులం వర్గం వర్ణం లింగం లేని, కులవివక్ష లేని ప్రత్యామ్నాయ సమాజాన్ని ఆయన నిర్మించాడని దాన్ని సమతా ప్రజాస్వామ్య సమాజం అన్నాడని అన్నారు. మనిషి సాంగీకరించబడాలని సమానత్వ భావన రావాలని తీవ్రంగా కృషి చేశారని కుటుంబ ప్రేమ సామాజిక ప్రేమ దేశభక్తి సర్వ మానవ ప్రేమ కలిగిన గొప్ప దార్శనికుడు బసవన్నే నని అన్నారు. అధునాతన సామ్యవాద స్పృహ అధునాతన సమతా స్పృహ ఆయన ప్రవచనాలు బోధిస్తాయని అన్నారు. కర్మ సిద్ధాంతం అత్యంత క్రూరమైన సిద్ధాంతంగా అభివర్ణించాడని దానివల్ల 90 శాతం మంది బానిసలు అవుతారని ఆర్థికంగా సామాజికంగా సాంస్కృతికంగా దోపిడికి గురవుతారని ఆయన రచనల్లో సారమని అన్నారు. అహంకారానికి కులతత్వానికి ఇదే మూలమని అన్నారు. ఈ సమాజం సమూహ నాయకత్వం సామాజిక న్యాయంతో ముందుకు నడవాలని కాంక్షించిన గొప్ప ప్రవచన కారుడు బసవన్న అని అన్నారు.ఈ సమాజానికి దారి చూపిన గొప్ప సంఘసంస్కర్తగా అభివర్ణించారు. అలాగే ఇటీవలి రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి వర్ధంతి సభల నిర్వహణకు సంబంధించిన జాబితా విడుదల చేసిందని ఈ జాబితాలో గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గుఱ్ఱం జాషువా పేర్లు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. వెంటనే రాష్ట్రప్రభుత్వం వీరిపేర్లతో సవరణ జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జిల్లా ఆవుల బసప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, జిల్లా నాయకులు ఎన్.నాగమణి, డీ.పార్వతయ్య, పులిచేరీ మహేష్ కుమార్, గోరంట్ల, ఆదోని డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సక్కిరి భాస్కర్, స్వయంప్రభ తదితరులు పాల్గొన్నారు.

- మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

- టిడిపి మాజీ నియోజకవర్గ ఇంఛార్జికి గ్రామస్థుల మొర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో సలకలకొండ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు టిడిపి మాజీ నియోజకవర్గ ఇన్చార్జ్ గుడిసె కృష్ణమ్మ దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం స్వచ్ఛ భారత్, స్వచ్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొందుకు వచ్చిన గుడిసె కృష్ణమ్మ ముందు గ్రామస్తులు ఆవేదన చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సాక్షాత్ అసెంబ్లీలో ప్రస్తావించిన కూడా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన చెందారు. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావట్లేదని గుడిసె కృష్ణమ్మ ఎదట వాపోయారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా చాలా అస్తవ్యస్తంగా ఉందని, ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీలు క్లీన్ చేయకుండా ఊర్లో పరిశుభ్రత అనేది కంటికి కనిపించడం లేదన్నారు. చాలామంది పెన్షన్లు రావడం లేదని కూడా కృష్ణమ్మ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కపటి మాజీ సర్పంచ్ మాధవ్, బైసిగేరి ఓంకార్, సలకలకొండా గ్రామ నాయకులు సీతారాం, ఈరన్న, శంకరన్నా మునీప్ప, పూజారి వెంకటరాముడు, ఖాసీం, గనేకల్ లక్ష్మన్న, టీడీపీ పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులతో, వాహనాలతో రద్దీ నెలకొంది. ఆదివారం, వేసవి సెలవులు కావడంతో రాఘవేంద్రస్వామి ఆలయాన్ని భక్తులు, యాత్రికులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులిచ్చిన అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. భక్తుల సందడితో శ్రీ మఠం ప్రాకారంతో పాటు వీధులన్నీ కిక్కిరిసి పోయాయి. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పడిన కష్టాలు వర్ణనాతీతం.

శ్రీ మఠంలో కన్నడ సినీ నటుడు ఉపేంద్ర

ప్రజాశక్తి - మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయం రాఘవేంద్రస్వామిని కన్నడ నటుడు ఉపేంద్ర కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొన్నారు. ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐ.పి నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హున్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. పీఠాధిపతులు శ్రీసు భుదేంద్రతీర్థులు వారికి శేషవస్త్రం, మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం: మండల కేంద్రంలోని హెచ్ఆర్‌బి కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలకు ఆదివారం ప్రముఖులు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మేకల హనుమంతు కుమారుడు ప్రాణేష్ కుమార్, మమతల పెళ్లి సందడిలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి, టిటిడి మంత్రాలయం ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, పట్టణ ఇంచార్జీ బి వరదరాజులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మద్దికేర

20 ఏళ్ల తర్వాత మద్దికేరలో కెవిఆర్ జడ్‌పి హైస్కూల్ నందు 2004 - 2005 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సంబరంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో వచ్చి ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని చదివిన బడి పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువుతో నేడు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరు కలిసి భోజనం చేసి తమ జ్ఞాపకాలను అనుభవాలను, కుటుంబ సభ్యుల పరిచయాలతో, తమకున్న సమయాన్ని గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మత సామరస్యానికి ప్రతికగా వెలిసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉర్సు ఉత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందువులు, ముస్లింలు ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అశేష జనవాహినితో దర్గా ప్రాంతమంతా కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్గా ధర్మకర్త మున్నా పాషా ఆధ్వర్యంలో ఫాతేహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

స్వామి వారి సన్నిధిలో మంత్రాలయం ఎమ్మెల్యే

శ్రీ జగద్గురు ఖాదర్ లింగ స్వామి సన్నిధిని మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ధర్మకర్త మున్న పాషా ఘనం స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. షాలువతో సత్కరించి పూలమాలతో సన్మానించారు.

అమర వీరునికి నివాళ్లు.. భారతదేశ, పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొంది అమరుడైన మురళీ నాయక్‌కు నివాళ్లర్పించారు. ఎమ్మెల్యే వై బాలనాగరెడ్డి మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో చిన్న మున్నా పాషా, మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వెంకటరామిరెడ్డి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మృతితో అనాధలైన బాలలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన కురువ సూర్య ప్రకాష్(23), అరుణమ్మ(20) అనే దంపతులు కుటుంబ సమస్యలతో క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆ దంపతుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాధలు అయ్యారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన అరుణమ్మ ఈనెల 1న ఉరి వేసుకుని మృతి చెందింది. భార్యా మృతిని జీర్ణించుకోలేని భర్త సూర్యప్రకాష్ కూడా ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అయితే వైద్య ఖర్చులు భారం కావడంతో గత రెండు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అక్కడ కోలుకోలేక సూర్య ప్రకాష్ ఆదివారం మతి చెందాడు. దంపతులు మృతితో అభం శుభం తెలియని చిన్నారులు అనాధలు అయ్యారు. స్థానిక పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వైసిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి- దేవనకొండ : మండలంలోని గుడిమి రాళ్ల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త భాస్కర్(40) గుండె నొప్పితో మృతి చెందారు. మృతునికి ఆదివారం ఉదయం ఇంటిదగ్గర ఛాతిలో ఆకస్మికంగా నొప్పి వచ్చి అపస్మారస్థితికి చేరాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకువచ్చారు. పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదికు కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పరామర్శించారు. అదేవిధంగా టిడిపి నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, కప్పట్రాళ్ల మల్లికార్జున, కరివేముల వీరేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇటీవల జరుగుతున్న ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న ఉద్రిక్తల నేపథ్యంలో రాష్ట్ర ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ముందస్తు జాగ్రత్తల పరంగా తనిఖీలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఇంచార్జ్ ఎస్పి అది రాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో ఈ రోజు జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు తదితర ప్రదేశాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలలో , సరిహద్దుల్లో, చెక్ పోస్టులలో ఆయా పోలీసులతో పాటు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలతో తనిఖీలు చేపట్టారు. జిల్లా అంతటా ఏక కాలంలో అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ కర్నూలు రైల్వే స్టేషన్, కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ లో బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. మీడియాతో మాట్లాడారు. చీఫ్ ఆఫీస్ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమానితులను విచారిస్తున్నామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు , అనుమానాస్పద వస్తువులు, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కర్నూల్ డిఎస్‌పితో పాటు కర్నూల్ టూ టౌన్ సిఐ నాగరాజరావు ఉన్నారు.

పబ్లిక్ స్థలాలలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-కోసిగి

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సిఐ మంజునాథ్ , ఎస్సై హనుమంత రెడ్డిలు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి , డిఎస్‌పి ఆదేశాల మేరకు పబ్లిక్ స్థలాలలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలతో పాటు అనుమానితులను తనిఖీ చేసామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. బైక్ నడిపేవారు కచ్చితంగా హెల్మెట్లను ధరించాలన్నారు. ఓవర్ లోడ్లతో వెళ్ళిన వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదన్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరగట్టులో పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - హోళగుంద

మండల పరిధిలోని కొత్తపేట, నేరనికి ,నేరనికి తండా, కొండ గుహలలో వెలసిన శ్రీ మాల మల్లేశ్వర సన్నిధిలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంపా, మహేష్, స్వాములు శ్రీ మాల మల్లేశ్వర లకు బిల్వార్చన, బండారు అర్చన అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం 6 గంటల నుండి బార్లు తీరి మొక్కలు తీర్చుకొని కింద నుండి గిరి వరకు ప్రతిమెట్టుకు కుంకుం బండారం అంటిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. శ్రీ మాల మల్లేశ్వర సన్నిధిలో అన్నదాన చేశారు. హోలగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఒక్కటైన కొత్త జంటలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆశిస్సులు అందించారు. ఆదివారం గ్రామానికి చేరుకొన్న ఆయనకు ఆహ్వానితులు ఘనంగా స్వాగతం పలికి శాలువతో పూల మాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా కోసిగి నరసమ్మ నారాయణల కుమారుడు రాఘవ, బోయ లక్ష్మి, ఉరుకుందుల కుమార్తె రాధికలను అదే గ్రామంలో జరిగిన కడతట్ల మంగమ్మ గోపాల్ ల కుమారుడు నాగరాజు,లక్ష్మి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైసిపి నాయకులు దశరథ రెడ్డి మజ్జిగ రోగప్ప, బొజ్జప్ప నారాయణ లక్ష్మయ్య ఉన్నారు.